రేపట్నుంచి మూడ్రోజులు వానలు

- ఎనిమిది జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గాలులతో వర్షాలు
- హైదరాబాద్‌కు సూచన లేదు
- వచ్చే రెండ్రోజులు వడగాల్పులు
- హైదరాబాద్ వాతావరణశాఖ

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): తీవ్ర ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు భారత వాతావరణ హైదరాబాద్ విభాగం చల్లటి ముచ్చట చెప్పింది. ఆదివారం నుంచి తెలంగాణలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని తెలిపింది. మూడు రోజులపాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడతాయని వెల్లడించింది. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది. సోమవారం ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాలలో వానలు పడతాయని ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. వివిధ జిల్లాల్లో మూడు రోజులపాటు వర్షాలు కురిసినా.. హైదరాబాద్‌లో మాత్రం కురిసే అవకాశం లేదని స్పష్టంచేసింది. 7, 8 తేదీల్లో తూర్పు మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు ఐఎండీ తెలిపింది.

తెలంగాణలో వచ్చే రెండు రోజులు వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణశాఖ హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు సైతం రెండు, మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదు కావచ్చని పేర్కొన్నది. రాష్ట్రంలో ఎండలు 43 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయని, ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటలకు ప్రజలు బయటకు రావొద్దని హెచ్చరించింది. 7వ తేదీ తర్వాత ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నట్టు తెలిపింది. శనివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. ఆదివారం ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ జిల్లాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొంటూ.. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. శుక్రవారం నల్లగొండ జిల్లాలోని ఇబ్రహీంపేటలో 43.5, కనగల్‌లో 43.4, మాడుగులపల్లిలో 43.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు టీఎస్‌డీపీఎస్ వివరించింది.

వేసవి తీవ్రతతో జ్వరాలు..

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగడంతో వేడి తీవ్రతకు తట్టుకోలేక ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. హైదరాబాద్‌లోని పలు దవాఖానల్లో అక్యూట్ డయేరియా డిసీజ్ (ఏడీడీ), వాంతులు, డీ హైడ్రేషన్ కేసులు పెరుగుతున్నాయి. వేసవిలో వడగాడ్పులు వీస్తున్నందున పిల్లలు జ్వరం బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కండ్లు మండటం, తలనొప్పి, తల తిరగడం, మూత్రంలో మంట వంటి లక్షణాలు కనిపిస్తాయి. వాంతులు, విరేచనాలు వచ్చినప్పుడు పిల్లలను చల్లని ప్రదేశాల్లో ఉంచాలని వైద్యులు సూచించారు. కొబ్బరి నీరు లేదా ఓఆర్ఎస్ వంటివి ఇవ్వాలని తెలిపారు. వేసవి కాలంలో నీళ్లు ఎక్కువగా తాగుతూ నీడ పట్టున ఉంటే మంచిదని పేర్కొన్నారు.

మరణించిన టీచర్‌కు షోకాజ్ నోటీసులు

మేడ్చల్ విద్యాశాఖ నిర్లక్ష్యం

జవహర్‌నగర్, ఏప్రిల్ 5 : పది పరీక్ష పత్రాల మూల్యాంకానికి రాని 385 మంది ఉపాధ్యాయులకు మేడ్చల్ విద్యాశాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వీరిలో దాదాపు ఏడాది క్రితం మరణించిన ఒక ఉపాధ్యాయురాలికి నోటీసుల రావడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జవహర్‌నగర్ జడ్పీహెచ్ఎస్‌లో ఎన్. గీత 2016-2023 వరకు సాంఘిక శాస్త్రం టీచర్‌గా పనిచేశారు. 2023 మే నెలలో క్యాన్సర్ వ్యాధితో ఆమె మృతి చెందారు. ఉపాధ్యాయురాలు మృతి చెందిన దాదాపు ఏడాది తర్వాత షోకాజ్ నోటీసులు జారీ చేయడం మేడ్చల్ విద్యాశాఖ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నదని ఉపాధ్యాయ సంఘాలు, సోషల్ మీడియా వేదికగా పలువురు మండిపడుతున్నారు. ఈ విషయమై హెచ్ఎం ఆజాంను వివరణ కోరగా జిల్లా అధికారులు ప్రధానోపాధ్యాయుల వాట్సాప్ గ్రూపులో షోకాజ్ నోటీస్ పోస్ట్ చేశారని, అందులో మృతిచెందిన గీత పేరు ఉండటంతో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు.

లాసెట్‌కు 17 వేల దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : న్యాయవాద వృత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే లాసెట్, పీజీలాసెట్‌కు శుక్రవారం నాటికి 17వేలకు పైగా దరఖాస్తులొచ్చాయి. మూడేండ్ల లాసెట్‌కు 12,101, ఐదేండ్ల లాసెట్‌కు 3,917, పీజీలాసెట్‌కు 1,381 దరఖాస్తులు నమోదైనట్టు సెట్ కన్వీనర్ బీ విజయలక్ష్మీ తెలిపారు. ఈ నెల 15న దరఖాస్తుల గడువు ముగియనున్నది.

ఐఐటీ, నీట్‌పై ఉచిత ఆన్‌లైన్ తరగతులు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు 30 రోజులు ఐఐటీ, నీట్‌పై ఉచిత ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తామని మెటామైండ్ అకాడమీ చైర్మన్ ఏ మనోజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఐఐటీ విద్యార్థులు, మెడికోలచే ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాలకు హైదరాబాద్‌లోని రామకృష్ణమఠం పక్కనే ఉన్న అకాడమీలో సంప్రదించాలని సూచించారు.

జేఈఈ గణితం ప్రశ్నలు కాస్త గొట్టు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : జేఈఈ గణితం పేపర్ ప్రశ్నలు విద్యార్థులను కాస్త తికమకపెట్టాయి. శుక్రవారం నిర్వహించిన గణితం పేపర్‌లో ప్రశ్నల నిడివి పొడవుగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. గురువారం గణితం పేపర్‌లో ఇచ్చినట్టుగానే ప్రశ్నలున్నట్టు శ్రీచైతన్య ఐఐటీ ఆలిండియా కో-ఆర్డినేటర్ ఉమాశంకర్ అభిప్రాయపడ్డారు. మొదటిషిఫ్ట్‌లో ఫిజిక్స్ పేపర్‌లో ఎక్కువగా ఫార్ములా బేస్డ్ ప్రశ్నలిచ్చారు. ఇవి సుల భం నుంచి మధ్యస్తంగానే ఇచ్చారు. ఇక కెమిస్ట్రీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి ప్రశ్నలిచ్చారు. ఇవి సులభంగానే ఉన్నా యి. గణితంలో వెక్టార్, త్రీడీ, సంభావ్యత సీక్వెన్స్ అండ్ సీరిస్, జ్యామెట్రి ఫిజిక్స్‌లో ఆధునిక భౌతికశాస్త్రం, గురుత్వాకర్షణ, సెమికండక్టర్‌ల నుంచి ప్రశ్నలిచ్చారు. ఇక రెండోషిఫ్ట్‌లో ఎప్పుడూ కఠినంగా ఉండే కెమిస్ట్రీ అత్యంత సులభంగా ఇచ్చారు. ఇక గణితం ప్రశ్నలు మధ్యస్తంగా ఇవ్వగా, సుదీర్ఘ ప్రశ్నలు విద్యార్థులను ముప్పుతిప్పలుపెట్టాయి. ఫిజిక్స్ ప్రశ్నలు కూడా సులభంగా ఇవ్వగా, ఫార్ములాబేస్డ్ ప్రశ్నలే ఎక్కువగా ఇచ్చారు. కెమిస్ట్రీలో ఆల్కహాల్‌లు, ఈథర్ అండ్ ఫినాల్స్, అమైన్‌లు, ఆల్డిహైడ్‌లు, కీటోన్స్, బయోమాలిక్యూల్స్, ఆల్కైల్ హాలైడ్స్, కెమికల్ కైనటిక్స్, ఎలక్ట్రోకెమిస్ట్రీ, వంటి సబ్జెక్టుల నుంచి ప్రశ్నలిచ్చినట్లుగా నిపుణులు విశ్లేషించారు.

పాత పెన్షన్‌ను మ్యానిఫెస్టోలో చేర్చాలి

ఎన్ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగులకు నష్టం కలిగిస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దుచేసి, పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తామని అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీనివ్వాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. దేశంలోని జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఈ అంశాన్ని తమ మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. దేశంలోని 84 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దుచేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం అమలు కొరకు రాష్ట్రంలోని 2 .30 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నాయని తెలిపారు. దేశంలోని 84 లక్షల కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించలేని పీఎఫ్ఆర్‌డీఏ చట్టం నుండి ప్రభుత్వ ఉద్యోగులను మినహాయించాలని స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గీతంతో ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ఎంవోయూ

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : గీతం డీమ్డ్ యూనివర్సిటీతో రాజమండ్రిలోని ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ (ఐసీఎస్ఈ) అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకొన్నట్టు వర్సిటీ వీసీ దయానంద సిద్దవట్టం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యూచర్ కిడ్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉన్నత విద్య అందించడం, మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా వారిని సన్నద్ధం చేయడం లక్ష్యంగా ఈ ఒప్పందం ఉద్దేశమని వెల్లడించారు. ఒప్పంద పత్రాలపై గీతం రిజిస్ట్రార్ డీ గుణశేఖరన్, ఫ్యూచర్ కిడ్స్ పాఠశాల ముఖ్య కార్యనిర్వహణాధికారి ఏలేటి రుద్రశ్రీ మహస్విసంతకాలు చేసినట్టు తెలిపారు. కాగా, గీతం వర్సిటీలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 61 యూనిట్ల రక్తాన్ని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది దానం చేశారు.

ఐక్యరాజ్యసమితి మాకు చెప్పక్కర్లేదు

- ఎన్నికల నిర్వహణపై కేంద్రమంత్రి జైశంకర్

తిరువనంతపురం, ఏప్రిల్ 5: భారతదేశ ఎన్నికలపై ఇటీవల ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రతినిధి చేసిన వ్యాఖ్యలను విదేశాంగ మంత్రి జై శంకర్ తిప్పికొట్టారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని మీరు మాకు చెప్పాల్సిన పనిలేదని జవాబిచ్చారు. భారత్‌లో రాజకీయ, పౌర హక్కులకు రక్షణ ఉంటుందని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం ఉంటుందని తాము ఆశిస్తున్నట్టు యూఎన్‌వో ప్రతినిధి చేసిన వ్యాఖ్యలపై మంత్రి జై శంకర్ పై విధంగా స్పందించారు. తిరువనంతపురంలో బీజేపీ తరుపున పోటీ చేస్తున్న తన మంత్రివర్గ సహచరుడు రాజీవ్ చంద్రశేఖర్ కోసం జైశంకర్ ప్రచారం చేయటానికి గురువారం అక్కడికి వెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మన దేశ ఎన్నికలపై సరైన సమాచారం లేకుండా, అపోహలు, అసత్యాలతో యూఎన్‌వో ప్రతినిధి మాట్లాడారని పేర్కొన్నారు.

టెలిమెట్రీల ఏర్పాటుకు నిధులివ్వండి

తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్5 (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు సంబంధించి పలు ఔట్‌లెట్లపై ఫేజ్ 2 కింద ఏర్పాటు చేయాల్సిన టెలిమెట్రీ స్టేషన్ల ఏర్పాటు కోసం నిధులను విడుదల చేయాలని ఇరు రాష్ట్రాలకు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) లేఖ రాసింది. కృష్ణా జలాల వినియోగం, నీటి విడుదలకు సంబంధించిన లెక్కలను పక్కాగా సేకరించేందుకు టెలిమెట్రీలను ఏర్పాటు చేయాలని గతంలోనే తెలంగాణ, ఏపీలు అంగీకరించాయి. మొదటి విడతలో భాగంగా ఇప్పటికే 18 చోట్ల టెలిమెట్రీ స్టేషన్లను ఏర్పాటు చేయగా, ఫేజ్ 2 కింద మరో 9 చోట్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకు సంబంధించిన నిధులను విడుదల చేయకపోవడంతో నిధుల ఇవ్వాలని కోరుతూ బోర్డు మరోసారి లేఖలు రాసింది. సవరించిన అంచనాల ప్రకారం రూ. 6.25 కోట్ల నిధులు అవసరమని, వాటిని వెంటనే విడుదల చేయాలని లేఖలో ఇరు రాష్ట్రాలకు బోర్డు సూచించింది.

బాబుజగ్జీవన్‌రామ్‌కు వినతి పత్రం ఇస్తున్న వంగపల్లి శ్రీనివాస్

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం

- మాదిగలను అణగదొక్కుతున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

రవీంద్రభారతి, ఏప్రిల్ 5 : బాబు జగ్జీవన్‌రామ్ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎంపీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ పిలుపునిచ్చారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం బషీర్‌బాగ్‌లో ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అందరూ సమానంగా జీవించాలని బాబు జగ్జీవన్‌రామ్ కలలు కన్నాడని, కానీ, సీఎం రేవంత్‌రెడ్డి ఆయన స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ మాదిగలకు అవకాశాలు ఇవ్వకుండా అణగదొక్కుతున్నారని ఆరోపించారు. మంత్రివర్గంలో మాల సామాజికవర్గానికి చెందిన భట్టి విక్రమార్కకు ఉపముఖ్యమంత్రి పదవి, స్పీకర్‌గా అదే సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌ను నియమించడం దారుణమన్నారు. మూడు ఎంపీ టికెట్లలో ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించకపోవడం జగ్జీవన్‌రామ్ ఆశయాలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్డి సామాజిక వర్గం వారు ఎన్ని తిట్టినా వారిని వెనకేసుకొచ్చిన రేవంత్‌రెడ్డి బక్క జడ్సన్ అనే మాదిగ బిడ్డను మాత్రం పార్టీ నుంచి బహిష్కరించారని మండిపడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కు మంచి బుద్ధి ప్రసాదించమని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు అవమానం

ఎలక్షన్ కోడ్ సాకుగా చూపి జగ్జీవన్‌రామ్ జయంతిని ప్రభుత్వం చాలా అవమానకరంగా నిర్వహించిందని, సీఎం రేవంత్‌రెడ్డి కనీసం జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేయకపోవడం ఆయనను అవమానించడమే పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలడుగు శ్రీనివాస్, పెంజర రమేశ్, శ్రీనివాస్ నంగునూరి, వేణు, యాదగిరి, కొల్లూరి వెంకటేశ్, రాహుల్, నరేశ్, సాయన పాల్గొన్నారు.

ఉదాసీనతతోనే తక్కువ పోలింగ్

- ఓటింగ్‌కు రాని యువత, పట్టణవాసులు
- నాలుగు నియోజకవర్గాల్లో తక్కువ పోలింగ్
- రాష్ట్రంలో అధిక పోలింగ్‌పై దృష్టి సారించండి
- సీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఈసీఐ



లోక్‌సభ	2019లో	
నియోజకవర్గం	ఓటింగ్ శాతం	ప్రస్తుత ఓటర్లు
హైదరాబాద్	44.84	21,97,531
సికింద్రాబాద్	46.50	20,98,347
మల్కాజిగిరి	49.63	37,36,216
చేవెళ్ల	53.25	29,06,213

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): యువకులు, పట్టణ ఓటర్లు ఎన్నికల ప్రక్రియ పట్ల ఉదాసీనతతోపాటు ఇతర కారణాల వల్ల దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైందని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఢిల్లీలోని ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వికాస్‌రాజ్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్, సీఈవో కార్యాలయం నుంచి హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల సీఈవోలను ఉద్దేశించి రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. తక్కువ శాతాలు నమోదు కావడానికి ఏదైనా నిర్దిష్ట సమస్య ఉంటే కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ హైదరాబాద్ గురించి ప్రజెంటేషన్ ఇచ్చారు. యువకుల ఉదాసీనత, రోజువారీ వేతనాలు పొందేవారు పోలింగ్ రోజున సెలవు ప్రకటించినప్పటికీ పనికి వెళ్లడం, ఒకే కుటుంబంలోని ఓటర్లను వేర్వేరు బూత్‌లకు కేటాయించడం, అంతర్గత వలసలు, క్యూలో వేచి ఉండటమే తక్కువ ఓటింగ్‌కు కారణమని చెప్పారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు విస్తృతంగా ప్రచారంతోపాటు పౌరులను భాగస్వాములను చేస్తామని తెలిపారు.

సగటు ఓటింగ్ శాతం 62.77 మాత్రమే

దేశంలో తక్కువ ఓటింగ్ నమోదవుతున్న నియోజకవర్గాలపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి పెట్టింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా తక్కువ ఓటింగ్ శాతం నమోదైన టాప్ 50 లోక్‌సభ నియోజకవర్గాలను గుర్తించింది. 2019లో దేశవ్యాప్తంగా సగటు ఓటింగ్ శాతం 67.40 కాగా తెలంగాణలో 62.77 శాతం మాత్రమే నమోదైంది. అతి తక్కువ పోలింగ్ జరిగిన 50 నియోజకవర్గాల జాబితాలో తెలంగాణ నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవేళ్ల నియోజకవర్గాలు ఉన్నాయి. ఓటింగ్ శాతం పెంచడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించడంపై దృష్టి సారించారు.

ప్రతిభావంతులకే వీసాలు: బ్రిటన్

లండన్, ఏప్రిల్ 5: బ్రిటన్ కంపెనీలు తమ సంస్థల్లో విదేశీ నిపుణులను నియమించుకొనే విషయంలో ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఇకపై ఏడాదికి కనీసంగా 38,700 పౌండ్ల(దాదాపు రూ.40 లక్షలు) జీతం చెల్లించే ఉద్యోగాలకు మాత్రమే విదేశీయులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో కనీసంగా 26,200 పౌండ్ల వార్షిక వేతనం చెల్లించే ఉద్యోగాలు చేయడానికి ఇతర దేశాలకు చెందిన వారికి నైపుణ్య ఉద్యోగ వీసాలు ఇచ్చేవారు. దీన్ని తాజాగా 48 శాతం పెంచారు. గురువారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త నిబంధన భారతీయులకు ప్రతికూలంగా ఉండనున్నది. బ్రిటన్‌లోని వైద్య సిబ్బంది, టెక్ నిపుణులు, విద్యార్థుల సంఖ్యలో భారతీయులు గణనీయంగా ఉంటారు. తక్కువ జీతానికి లభించే విదేశీ సిబ్బంది వలన తమ పౌరులు జీతభత్యాలు కూడా తగ్గిపోతున్నాయని, దీన్ని నివారించేందుకే కొత్త నిబంధన తీసుకొచ్చామని బ్రిటన్ మంత్రి జేమ్స్ క్లెవర్లీ పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతిభావంతులకే వీసా లిస్తామని చెప్పారు.

భవిష్యత్తు విద్యావంతులు, పారిశ్రామికవేత్తలదే

- 2047 నాటికి దేశంలో అధికశాతం వారే ఉంటారు
- జేఎన్టీయూహెచ్ సదస్సులో ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారామ్

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : దేశంలో 2047 నాటికి అధిక శాతం విద్యావంతులుగా ఉంటారని, పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతారని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) చైర్మన్ టీజీ సీతారామ్ అన్నారు. జేఎన్టీయూ హైదరాబాద్‌లో శుక్రవారం 'నావిగేటివ్ ది ఆపర్చునిటీస్ ఇన్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ ఫ్యూచర్ భారత్' అనే అంశంపై నిర్వహించిన ఒక్క రోజు సదస్సులో సీతారామ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సొంతంగా పరిశ్రమలు పెట్టుకోవడంతో పాటు ఎందరో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే స్థాయికి చేరుకొంటారని అభిప్రాయపడ్డారు. స్కూల్ స్థాయి నుంచి బయటకు వస్తున్న 100 మందిలో 25% నుంచి 30% మంది మాత్రమే విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సులలో చేరుతున్నట్టు తెలిపారు. ఈ సంఖ్య 2035 నాటికి 50 శాతానికి పెరుగుతుందని చెప్పారు. మాడల్ స్కూల్, ప్రాథమిక విద్యను మెరుగుపరిస్తేనే అమృత్కాల్ లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. జేఎన్టీయూ వీసీ కట్టా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో పూర్వకాలంలోనే గొప్ప ఇంజినీరింగ్ ప్రతిభ కలిగి ఉన్నదని చెప్పారు. ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించకుండా పెద్ద కట్టడాలు నిర్మించిన గొప్ప పరిజ్ఞానం మన దేశానిదని తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంత లక్ష్మణ్, జేఎన్టీయూ రెక్టార్ డాక్టర్ కే విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కే వెంకటేశ్వర రావు, డైరెక్టర్ జీ విజయ్‌కుమారి, ప్రిన్సిపల్ జీవీ నర్సింహారెడ్డి, వర్సిటీ ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

అదనపు పీపీలపై కేసు కొట్టివేత

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ప్రచారంలో పాల్గొన్నారంటూ నిజామాబాద్ జిల్లా బోధన్ కోర్టులోని ఇద్దరు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లపై పెట్టిన క్రిమినల్ కేసును హైకోర్టు కొట్టివేసింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా ఉన్న జీ శ్యాంరావు, పీ సామయ్య ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారన్న ఫిర్యాదు మేరకు ఐపీసీలోని సెక్షన్ 120, 188 కింద బోధన్ పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. దీన్ని సవాల్ చేస్తూ నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే సుజన ఇటీవల తీర్పు చెప్పారు. నిందితులపై సంబంధిత అధికారి ఫిర్యాదు చేయలేదని, వారికి ఐపీసీ సెక్షన్ 120, 188 వర్తించబోవని స్పష్టం చేస్తూ.. పోలీసుల ఎఫ్ఐఆర్‌ను కొట్టివేశారు.

లోకం పోకడ



కిడ్నాప్ కాదయ్యా.. ఎంపీ టికెట్ ఇస్తామని పార్టీలోకి ఆహ్వానిస్తున్నాడు!

నేను పార్టీ మారడం లేదు: ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, ఏప్రిల్ 5 : తాను పార్టీ మారడం లేదని, తనపై సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తేల్చిచెప్పారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ముషీరాబాద్ బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తాను బీఆర్ఎస్‌ని వీడుతున్నట్లు వస్తున్న తప్పుడు ప్రచారాన్ని నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గం ప్రజలు నమ్మొద్దని కోరారు. తనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు.

మిస్టర్ రేవంత్.. ఆన్సర్ మీ : డీకే అరుణ

నారాయణపేట, ఏప్రిల్ 5 : 'మిస్టర్.. రేవంత్‌రెడ్డి ఆన్సర్ మీ.. రైతులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తావు? అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ప్రశ్నించారు. రాష్ట్రంలో సాగునీరు లేక రైతులు అష్టకష్టాలు పడుతున్నా ముఖ్యమంత్రికి రాజకీయాలు తప్ప కర్షకుల గోస పట్టడం లేదని ధ్వజమెత్తారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దీక్షలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఎన్నికలప్పుడు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని విమర్శించారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద రూ.15 వేల సాయం, ధాన్యం క్వింటాల్‌కు రూ.5 వందల బోనస్ ఇలా ఏ ఒక్క హామీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నందున అక్కడి ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేయించి ఎండిపోతున్న పంటలను కాపాడాలన్న ధ్యాస కూడా రేవంత్‌కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎన్నికల్లో రైతులు ఓటుతో బ